# జంట కొమ్ములు!

ఆ మధ్య నెలా పదిహేను రోజులుగా మా వూరు వెళ్ళలేదు పనుల వొత్తిడివల్ల. ఆ రోజు సాయంత్రం బస్సు దిగి, అలా హైస్కూలు, డిస్పెన్సరీ, లోకల్ లైబ్రరీ అథారిటీవారి శాఖా గ్రంథాలయమూ దాటి మా వీధి ముగల్లోకి వెళ్ళేసరికి – రమణయ్యగారి డాబామీద అందమైన అక్షరాలతో ఆకర్షణీయంగా ఓ బోర్డు కనబడింది! కన్స్యూమర్స్ కోపరేటివ్ స్టోర్సు అని. దానిముందు జనం కొండవీటి చేంతాడులా క్యూలో నిలబడి ఉన్నారు. కంట్రోలు రేటుకు పచ్చిసెనగపప్పు యిస్తున్నారట.

మా ఊళ్ళో కొత్తగా కోపరేటివ్ స్టోర్స్ పెట్టడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించినా – సహకార రంగంలో గ్రామం ముందంజవేసి, ప్రజలలో సహకార మనోద్భావాలు పెంపొందేందుకు ఓ సంస్థ నెలకొల్పబడడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. నిత్యావసర వస్తువుల ధరలు నల్లబజారు వర్తకుల పాలసలో ఆకాశంలోని నక్షత్రాలను అందుతున్న తరుణంలో ప్రతి పట్టణంలోనూ, పల్లెలోను ఇలాంటి వాడకందార్ల సహకార

సంస్థలు విరివిగా వెలిసి, ధరల్ని అదుపులో పెట్టడానికి బాగా వినియోగపడడం దేశాభ్యుదయానికి, దేశక్షేమానికి ఎంతో లాభదాయకమని విశ్వసించే వాళ్ళలో నేనొకణ్ణి. పట్టణాలలో ఇలాంటి స్టోర్సులు ఇప్పటికే దాదాపు చాలా వెలిశాయి. ధరల స్థిరీకరణ, ప్రజలలో సహకార భావస్ఫురణా ఉద్దేశ్యాలతో ప్రభుత్వం ఆ సంస్థలకు విరివిగా ఆర్థిక సహాయం ఉచితంగాను వడ్డీలు లేని అప్పుల ద్వారాను చేస్తోంది. కానీ పల్లెటూర్లలలో ఈ ఉద్యమం అంతగా ఆచారణరూపం దాల్చలేదు. ఆపరిస్థితులలో మావూళ్ళో కోపరేటివ్ స్టోర్సు స్థాపించ బడడం మావూరి ప్రజల ప్రగతి శీలనాశక్తినీ, సహకార బలాన్నీ, అభ్యుదయ కాంక్షను తేటతెల్లపర్చగలదు.

నేను బజార్లో కొంచెంసేపు నిలబడ్డాను. స్టోర్సుముందు క్యూలో నిలబడ్డ జనాన్ని చూస్తూ. వాళ్ళుచాలాసందడి చేస్తు న్నారు. మా పెదనాన్నగారి పెద్దబ్బాయి ఎక్కడికో వెడుతూన్న వాడల్లా నన్ను చూసి, ఆగి, దగ్గరకొచ్చి పలకరించాడు.

"మన వూళ్ళో ఈ స్టోర్సు ఎప్పుడు పెట్టారు?"

"నీకు తెలియదేమిటి? నెలైంది ప్రారంభించి. మంత్రిగారే ప్రారంభోత్సవం చేశారు. కొత్త ఒక వింతకదూ! జోరుగా సాగుతోందిలే!" అన్నాడు వాడు.

"ప్రెసిడెంటెవరు?"

"ఇంకేమను! మన పంచాయతీబోర్డు ప్రెసిడెంటే–దీని కూడా ప్రెసిడెంటు. వాళ్ళ పార్టీ వాళ్ళందరూ ఇందులో మెంబర్లు. ఈ స్టోర్సుకు గవర్నమెంటు పాతిక వేల రూపాయల ధనసహాయం కూడా చేసిందంట.

"వస్తువులు చవుగ్గా దొరుకుతున్నాయా!"

"ఏమో! కొంతమంది కొన్ని వస్తువులు చౌక అంటున్నారు. మరికొంతమంది కొన్ని వస్తువులు ప్రియం అంటున్నారు. ఇంకా కొంతమంది ఇదంతా మూడునాళ్ళ ముచ్చటే గదా అంటున్నారు. ఏమైనా ఈ స్టోర్సు వచ్చాక వూళ్ళో చిల్లర దుకాణాదార్ల నోళ్ళలో మట్టిగడ్డలు పడ్డాయి. వాళ్ళ బేరాలు అడుగంటి పోయాయి."

"కంట్రోలు వస్తువులన్నీ లభిస్తున్నాయా!"

కొంతమందికి మటుకే బియ్యం! పల్లెలోని వాళ్ళముఠాకి మాత్రమే! గోధుమలు, బొంబాయి రవ్వ, పచ్చి శెనగపప్పు పలుకుబడిగల మెంబర్లకు పంచదార పలుకుబడి లేని మెంబర్ల కూడా ఇస్తున్నారు."

"శెనగపప్పుకు మనవూళ్లో మంచి డిమాండు ఉన్నట్టున్నదే!"

"కంట్రోల్ వస్తువు గదా! అవసరం లేక పోయినా దాన్ని తెచ్చుకొని ఇంట్లో పెట్టుకోవడంలో ఓ గొప్పదనం ఉంది. విడివిగా మార్కెట్టులో దొరికే రోజులలో ఊళ్లో

సెలకు ఒకబస్తా కూడా అమ్ముడు పోయేది కాదు. ఇప్పుడు ప్రభుత్వం దానికి "కంట్రోల్ కమ్మొడిటీ" అన్న బిరుదు కట్టి బెట్టే సరికి పది బస్తాలు ఒక్కరోజులోనే ఎగిరిపోతున్నాయి. కంట్రోల్‌లో వున్న మహాత్మ్యం అదే!

మా వూళ్లో కన్స్యూమర్స్ కోపరేటివ్ స్టోర్సు స్థాపించ బడి, నిర్విఘ్నంగా అది పనిజేస్తున్నందుకు నేను గర్వించాను. కాని మరో కొంచెం మాసాలు గడిచేప్పటికి నేను గర్వించడం కేవలం అవివేకమనే భావానికి గురికాక తప్పలేదు. స్టోర్సు నిర్వహణలో చవుకబారు రాజకీయాలు చోటు చేసుకున్నాయి. కాపుకొచ్చిన ద్రాక్షతోటకు పురుగుపట్టినట్లు సహకారంతో స్వార్థం కరచాలనం చేసింది. ఆ రెండూ జంటకొమ్ముల్లా పెరుగుతున్నాయి. స్టోర్సు మెంబర్ల అసంతృప్తి హెచ్చింది. ప్రెసిడెంటుగాని, ఆయన ఇంట్లోవాళ్లుగాని ఏ వస్తువుకొన్నా డబ్బు ఇవ్వడం లేదుట. పైపెచ్చు కంట్రోలు వస్తువులకు వూళ్ళో కటకటగా వుంటే శెనగపప్పు, పంచదార, బియ్యమూ బస్తాలకు బస్తాలు నల్లబజారుకు తరలించ బడుతున్నాయట. ఆ లాభంలో ప్రెసిడెంటుకు, సెక్రెటరీకి, డైరెక్టర్లకూ వాటా లున్నాయట. స్టోర్సుకు కొనే వస్తువులలో కూడా కమీషన్ వ్యాపారం మిక్కుటంగా జరుగుతున్నదట. స్టోర్సు సేల్సు మేనేజరు సరిగా అమ్మకపు బిల్లులు వ్రాయకుండా, సరుకు తరుగుదలను ఎలుకలపై ఆరోపణ చేస్తున్నాడట. రోజుగారీ అమ్మకపుసొమ్ము, ప్రెసిడెంటు బస్తీక్లబ్బులలో ఆడే [illegible]

సరిపోవడంలేదుట. ఈ సస్పెన్షన్లన్నింటినీ పంచాయతీ బోర్డులో ప్రతిపక్ష సభ్యులు బహుళంగా ప్రచారం గావించి స్టోర్సుపై ఊళ్ళోవాళ్ళకి విరక్తిని, విసుగును, ద్వేషాన్ని అసహ్యాన్ని, దురభిప్రాయాన్ని కలిగించారు. మూడు మాసాలలోనే స్టోర్సు మూతబడే స్థితికి వచ్చింది. వాటాదార్లు తమ డబ్బుకోసం ఎగబడసాగారు.

స్టోర్సుకు మధ్యంతరపు ఎన్నికలు జరపాలని, కొన్ని నిబంధనల్ని మార్చాలని, ప్రెసిడెంటునూ, సెక్రటరీని పదవీచ్యుతుల్ని చేయాలని, కొత్తపాలకవర్గాన్ని ఎన్నుకోవాలని, కొంతమంది మెంబర్లను కూడగట్టుకొని ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా కృషి చేయసాగారు. అధికారుల్ని కూడా సంప్రదించారు.

స్టోర్సుకు జనరల్ బాడీ మీటింగ్ పెట్టించమని నూట ఇరవై అయిదు మంది సభ్యులు ప్రెసిడెంటుకు రిక్విజిషన్ నోటీసు ఇచ్చారు. ప్రెసిడెంటు భయపడలేదు. పైపెచ్చు చిరునవ్వు నవ్వుతున్నాడు. ఆనోటీసును చిత్తుకాగితాల బుట్టలో వేశాడు. "మినిట్సు పుస్తకాలు మన అధీనంలో ఉన్నంత కాలం మన పదవులకు ప్రమాదమేమీ లేదు" అన్నాడు సెక్రటరీ హామీయిస్తూ.

"గుళ్లో తీర్థానికూడా లెక్కాడొక్కా ఎవడు చూపెడతాడు!" అన్నాడు ప్రెసిడెంటు కుచ్చుమీసాల్ని సవరించుకుంటూ.

మా స్టోరంతా స్టోర్సు రాజకీయాలతో అట్టుడికి పోతున్నది. స్టోర్సు పెట్టేముందు ప్రెసిడెంటు మెంబర్లుగా చేరబోయే వారందరికీ దాని లాభాలను గురించి, గ్రామీణ వ్యవస్థలో అది తీసుకొచ్చే మార్పుల్ని గురించి ప్రజలలో అభివృద్ధిపర్చే సహకారాన్ని గురించి దీర్ఘంగా ఉపన్యాసాలిచ్చాడు. కాని ఆ ఉపన్యాసాలలోని ఏ ఒక్క ఆశయమూ ఆచరణలోకి రాకపోయేసరికి మెంబర్లు కొంగాలూ మిరియాలూ నూరసాగారు. కొంతకాలంది వ్యక్తుల స్వార్థానికి స్టోర్సు సాధనంగా ఉపయోగపడిందని తెలుసుకున్నారు. సర్వసామాన్యంగా పల్లెప్రజలు ఓ వింతసామూహిక మన స్తత్వానికి అలవాటుపడి వుంటారు. గ్రామంలో ఏం అన్యాయం జరిగినా తమకు తెలియనంతకాలం పట్టించుకోరు. తెలిసినతర్వాత ఓ క్షణం కూడా మెదలకుండా పూనుకోరు ఆ అన్యాయాన్ని ప్రతిఘటించే వరకు.

ఆ రోజు రాత్రి నేను వూళ్లోనే ఉన్నాను. మరునాడు ఉదయం ఒక్కసారి గుప్పుమన్నది. కో ఆపరేటివ్ స్టోర్సులో దొంగలు పడ్డారని, వూళ్ళోవాళ్ళంతా స్టోర్సు చుట్టూచేరారు. పోలీసుల్ని పిలిపించారు. ప్రెసిడెంటు అంతకు క్రితంరోజే మంత్రిగారి వద్ద పనివుండి హైదరాబాద్ వెళ్ళాడట.

పోలీసువారికి సెక్రటరీ రిపోర్టు ఇచ్చాడు. ప్రెసిడెంటుగారు వూళ్ళో లేని సమయాన కన్నాలుమర్సి కో ఆపరేటివ్

స్టోర్సులో రాత్రి వేళ దొంగలుపడి అయిదువేల రూపాయల నగదును పదిహేనువేల రూపాయల సరుకును దోచుకెళ్ళడం జరిగింది.

టెలిగ్రాం ఇచ్చి ప్రెసిడెంటును వెంటనే హైద్రాబాద్ నుంచి పిలిపించారు. "ఏంచేస్తాం! ఈ గ్రామ ప్రజలకు కో ఆపరేటివ్ స్టోర్సు ప్రయోజనాల్ని అనుభవించే అదృష్టం లేదు" అన్నాడు ప్రెసిడెంటు.

ఆ రోజునుంచి మా వూళ్ళోని కో ఆపరేటివ్ స్టోర్సుకు తాళాలు పడ్డాయి కాని ఆ దొంగతనం ప్రెసిడెంటు, సెక్రటరీల ప్రోద్బలంమీద జరిగిందని అనుకొనే ప్రజల నోళ్ళకు తాళాలుపడ లేదు.